# పాపిష్టి సంఘం

మంచాన్ని అంటుకుపోయి మూలుగుతూ పడుకున్న కేశవయ్య కొడుకుని దగ్గరకు పిలిపించుకునేటప్పటికి వరండాలో మూగిన అప్పుల వాళ్ళల్లో గుసగుసలు—"ముసలి ముండాకొడుకు ధనం దాచేవుంటాడు మన సంగతి ఏంచెపుతాడో!"

కేశవయ్య కొడుకుని దగ్గరకు రమ్మని ఇలా చెప్పాడు, 'బాబూ, నే బ్రతకను. చచ్చిపోయేముందు నీకొక సలహా చెబుతాను...." అని చెప్పి బాధలో కొంచెంసేపు ఆగి ఈ విధంగా పూర్తిచేశాడు—"చచ్చిపోయేటప్పటికి వీలైనన్ని అప్పులు చేసి వుంచుకో, ఈ పాపిష్టి సంఘాన్ని మోసం చెయ్యగలిగాననే తృప్తి వుంటుంది."

తండ్రి మాటలు చెప్పినప్పుడు కొడుక్కి కష్టంవేసింది. కాని పెద్దవాడై లోకులు తన్నుముంచి, చచ్చిపోయేటప్పుడు ఒక్క పిట్టయినా చూడటానికి రానప్పుడు, తండ్రిమాటలు విననందుకు పశ్చాత్తాపపడ్డాడు—